వ్యాస కౌముది



# వాడుక తెలుగు

## కర్లపాలెం హనుమంతరావు

గతంలో మాదిరి సాహిత్యావసరాలకు మాత్రమే కాకుండా ఇవాళ మాధ్యమ రంగానికీ తెలుగు వాడకం బాగా విస్తరించింది. వివిధ రంగాలలో విశ్వవ్యాప్తంగా జరుగుతున్న విశేషాలను తాజాగా పాఠకులకు అందించే ప్రసార మాధ్యమాలు .. ప్రధానంగా వార్తాపత్రికలు తెలుగీకరణకు సంస్కృత పదబంధాలనే అధికంగా వాడుతున్నాయి. శిఖరాగ్ర సమావేశం, పంచవర్ష ప్రణాళిక, అల్పసంఖ్యాక వర్గాలు, త్రైపాక్షిక చర్చ, ఆమరణ నిరాహారదీక్ష, మధ్యాహ్న భోజన పథకం, అలీన దేశాలు వంటి చక్కని పదబంధాలన్నీ పత్రికల సృష్టే. ఇవి గతంలో సంస్కృత భాషకు పరిచితాలు కావు.

తెలుగు బోధనాభాషగా మారిన ప్రస్తుత సందర్భంలో ఆంగ్ల పారిభాషిక పదాల నెన్నింటినో తెలుగులోకి తెచ్చుకోవలసిన అగత్యం ఏర్పడుతున్నది. దాదాపు తొంభైయైదు శాతం పైగా సంస్కృత పదాల రూపంలోనే ఆ పారిభాషికా పదాలు తెలుగు పలుకుబళ్లుగా స్థిరబడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన సాగిన కాలంలో తెలుగు అకాడమీ వారు ప్రచురించిన 'సామాన్య భాషాశాస్త్రం' చివర ఇచ్చిన పారిభాషిక పదకోశంలో తెలుగు పారిభాషిక పదాలుగా ఇవ్వబడిన దాదాపు 400 పదాల్లో ఒక్క 'రొద' అన్న పదం తప్ప తక్కినవన్నీ సంస్కృత పదాలే. ఇతర శాస్త్రాలకు సంబంధించిన పారిభాషిక పదాల్లో కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి. సమకాలీన అవసరాల నిమిత్తం భాషలో వచ్చే ఈవిధమైన సహజ పరిణామాలను అడ్డుకోవడం ఎవరి తరం కాదు, కాకూడదు కూడా!

కాకపోతే, ఒక భాషాపదాలను తెలుగులో తత్సమాలుగా వాడే సందర్భంలో ఆయా భాషా నియమాలను అతిక్రమించకపోవడం మర్యాద. విచిత్రం ఏమిటంటే, ఈ నియమభంగం, ఇతర భాషా పదాల్లో కంటే, సంస్కృత భాషా పదాల ప్రయోగంలోనే ఎక్కువగా జరగటం! ప్రాథమిక వ్యాకరణ సూత్రాల పట్ల ఉండవలసిన అవగాహ లేకపోవడం వల్ల వందలకొద్దీ సంస్కృత అపప్రయోగాలు ప్రజామోదితాలవుతున్నాయి. అట్లాంటి కొన్ని సంస్కృత అపప్రయోగాలను గూర్చి సూక్ష్మంగా వివరించటం వరకే ఈ వ్యాసం పరిమితి .

పత్రికా, విద్యారంగాలలో నేడు బాగా వాడుకలోకి వచ్చిన పదం – ప్రశ్నాపత్రం. ప్రశ్న అనేది హ్రస్వ అకారాంత శబ్దం. ప్రశ్నపత్రం అనడమే నిర్దుష్ట పదప్రయోగం .

అట్లాగే పత్రికల పుణ్యమా అని ఇటీవలి కాలంలో బాగా స్థిరపడిన పదం— భవిత. భావికాలం, భవిష్యత్కాలం అనే అర్థంలో ఈ పదం వాడుతున్నాయి పత్రికలు . కాని, ఈ విధమైన పదం సంస్కృతంలో అసలు ఏర్పడడానికి అవకాశం లేదు. . భవితవ్యం అని వాడటం తప్పనిసరి .

ఇట్లాంటిదే మత్స్యకారులు – అనే మరో అపప్రయోగం. వస్త్రకారుడు, స్వర్ణకారుడు, చర్మకారుడు తరహాలో వాడుతున్నాయి పత్రికలు ఈ పదాన్ని. వస్త్రకారుడంటే వస్త్రాలు తయారుచేసేవాడు, చర్మకారుడంటే చర్మంతో వస్తువులు తయారుచేసేవాడు. ఈ రకంగా చూస్తే మత్స్యకారులనే పదానికి చేపలను తయారుచేసేవాళ్ళనో , చేపలతో వస్తువులు తయారుచేసేవాళ్ళనో అర్థం వస్తుంది. చేపలు పట్టేవాళ్ళనే అర్థం వచ్చే చక్కటి తెలుగు పదం కోసం గాలింపు ఇంకా కొనసాగాల్సిందే. అందాకా అందరికీ సుపరిచితమైన ఏ జాలర్లో, బెస్తలో అని వాడడం సౌకర్యంగా ఉంటుంది.

ఆమధ్య ఒకానొక ప్రముఖ దినపత్రికలో 'మహిళా బాధితులకు సత్వరన్యాయం' అన్న శీర్షికతో ఒక వార్త వచ్చింది. మహిళల కోసం ఒక పోలీస్ స్టేషన్ను కొత్తగా ఏర్పాటుచేస్తున్న సందర్భంగా వచ్చిన వార్త అది. 'మహిళా బాధితులకు' అనే పదానికి 'బాధింపబడిన మహిళలకు' అని అర్థమని ఆ పత్రిక భావించటం వల్లే ఈ అపప్రయోగం. ఈ అర్థంలో బాధిత మహిళలు అనడం సబబు .

ఇట్లా పత్రికా భాషలో కనిపించే అపప్రయోగాలు కోకొల్లలు. అన్నీ వివరించటానికి ఇక్కడి స్థలం చాలదు. స్థూలంగా కొన్ని ఉదహరిస్తాను.

దళాల సమాయత్తం, గ్రామాల దగ్ధం, దేశాల విచ్ఛిన్నం. భావార్థం ప్రయోగించకుండా విశేషణాలు ప్రయోగించడం వల్ల కలిగిన అనర్థం. దళాల సమాయత్తత; దేశాల విచ్ఛిన్నత; గ్రామాల దహనం అంటే సరిపోతుంది.

అట్లాగే సవిమర్శనాత్మక, సశాస్త్రీయ తరహా పదాలు కూడా. సిద్ధాంత గ్రంథాల్లో కూడా చోటు చేసుకుంటున్నాయి ఇట్లాంటి పదప్రయోగాలు . ఇక్కడ విమర్శనాత్మక, శాస్త్రీయ అనే పదాలు వాడటం నిర్దుష్టంగా ఉంటుంది.

వయః పరిమితి బదులు వయోపరిమితి, సౌహార్దం బదులు సౌహార్ద్రం, సౌభ్రాత్రం బదులు సౌభ్రాతృత్వం; సమర్థంగా, పటిష్ఠంగా అనడానికి బదులు సమర్థవంతంగా, పటిష్టవంతంగా అనటం సర్వ సాధారణమై పోయింది పత్రికల మూలకంగా. స'మ'ష్టి బదులు స'మి'ష్టి అని వాడటమూ ఈ కోవకు చెందే అపప్రయోగమే .

ప్రాధాన్యం, ప్రాముఖ్యం, ప్రావీణ్యం బదులుగా ప్రాధాన్యత, ప్రాముఖ్యత, ప్రావీణ్యత; పునరావృత్తం బదులు పునరావృతం; దేవదాయం బదులు దేవాదాయం; జగదంబ బదులు జగదాంబ అనీ– ఇలా ఎన్నో పదాలను తప్పుగా ప్రయోగించటం నిరాటంకంగా సాగిపోతుంది. తప్పు తెలుసుకొని సరిదిద్దుకోవటం అవసరం.

ఏతా వాతా చెప్పొచ్చేదేమిటంటే ఇతర భాషా పదాలను మనం తెలుగులోకి తెచ్చుకొని వాడుతున్నప్పుడు ఆయా భాషా నియమాల మర్యాదను కాపాడటం మన కర్తవ్యం,. ఆ శ్రద్ధే మన భాష సక్రమంగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

***